VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 284

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 28 మార్చి 2026


## కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

### -ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు



**అమరావతి, కలంకౌంటర్ :** పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్ చేస్తూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "కఠినమైన, సవాలుతో కూడిన సమయాల్లోనే నిజమైన నాయకత్వ పటిమ బయటపడుతుంది. నేను ఎప్పుడూ చెప్పే మాట ఇదే. ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారతదేశం స్థిరంగా ముందుకు సాగుతోంది. అలాంటి నాయకుడు మనకు ఉండటం దేశ ప్రజల అదృష్టం. ఈ రోజు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం అత్యంత బలమైన, ప్రజా కేంద్రకమైన చర్య. ఆంధ్రప్రదేశ్ తరఫున మేం ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరల ప్రభావం నుంచి సామాన్యుడిని రక్షించడానికి ఈ నిర్ణయం ఎంతగానో సహాయపడుతుంది. నేడు అనేక దేశాలు తమ పౌరులపై ఇంధన ధరల భారాన్ని మోపుతుంటే, భారతదేశం మాత్రం తన ప్రజలకే ప్రథమ స్థానం ఇస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రజల పట్ల ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఇదే నిదర్శనం" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

## పెట్రోల్, డీజిల్‌పై సుంకాల తగ్గింపు.. ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ ధన్యవాదాలు



**అమరావతి, కలంకౌంటర్ :** పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించేలా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించిన ప్రధాని మోదీ గారికి ధన్యవాదాలు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.10 తగ్గించారు, డీజిల్ పై పూర్తిగా రద్దు చేశారు. ప్రజలకు ఉపశమనం కలిగించేలా తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుంది. ఇంధన కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే... పశ్చిమాసియా యుద్ధ ప్రభావం నుంచి ప్రజలకు ఊరటనిస్తూ ఇంధన ధరలు పెరగకుండా భారీగా ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన ప్రధాని మోదీ గారికి, కేంద్ర ప్రభుత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు.

## రాములోరి కళ్యాణోత్సవం

### -పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి









**భద్రాచలం,కలంకౌంటర్ :** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. మిథిలా మండపంలో జరిగిన ఈ క్రతువును తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల

- 2లో








1ST FLOOR, VAARAHISILKS, OPP. METRO PILLAR #A756, ROAD NO. 1, KPHB, HYDERABAD. | +91 91000 01929

## శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే కాగిత దంపతులు





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలంలో గ్రామ గ్రామాన శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలు సీతారాముల కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో జరిగిన ఈ కళ్యాణ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారికి తమ భక్తి చాటుకున్నారు అలాగే ఆయా గ్రామాల్లో భారీ అన్నసామారాధన కార్యక్రమాలు కూడా జరిగాయి. బంటుమిల్లి మండలం నాగేశ్వరావుపేట గ్రామంలోని సీతారామస్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది . అలాగే బంటుమిల్లి సంత బజార్ లో గల రామాలయంలో శ్రీరామ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకల్లో గ్రామానికి చెందిన మురారి మోహన కృష్ణ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ వేడుకల్లో గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది కొల్లా చంద్రశేఖర్ దంపతులు అలాగే కొప్పర్తి సుమంత్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం దేవాలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. అలాగే పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనమ్మ వేడుకలు దేవాలయ వ్యవస్థాపకులు సన్నాల మస్తాన్రావు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

## అత్యంత వైభవంగా సీతారాముల కళ్యాణం



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి శివారు రావివారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రాముని ఆలయం వద్ద సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అడుసుమిల్లి శ్రీనివాసరావు అర్చకత్వంలో పాల్గొన్న రావి శ్రీనివాసరావు (దంత వైద్య నిపుణులు) దంపతులు ,,పిడికిటి రాంబాబు దంపతులు, రావి ప్రసాదరావు దంపతులు , బండి చైతన్య దంపతులు పీటల మీద కూర్చుని సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణం చూడడానికి గ్రామస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి ప్రసాదం చలిమిడి వడపప్పు పానకం అందజేసి సుమారు 500 మందికి పైగా అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ దీప కాంతులతో రాత్రికి స్వామివారి ఊరేగింపు కార్యక్రమం రవివారిపాలెం పురవీధులు గుండా ఊరేగుతూ స్వామివారు భక్తులకి దర్శనం ఇచ్చారు.రామాలయం కమిటీ సభ్యులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## బస్సు ప్రమాద బాధితురాలికి మంత్రుల పరామర్శ

- ఒంగోలు రిమ్స్ లో మణెమ్మను పరామర్శించిన స్వామి, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు దామచర్ల, ఇంటూరి, విజయ్ కుమార్ తదితరులు...
- బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ
- మణెమ్మకు ఆర్థికసహాయం అందించిన ఎం ఎల్ ఏ నాగేశ్వరరావు



**ఒంగోలు, కలంకౌంటర్ :** మార్కాపురం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి, ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, దామచర్ల జనార్ధన్, బి ఎన్ విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ లు శుక్రవారం పరామర్శించారు. 13 మంది బాధితులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన బత్తుల మణెమ్మ కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రిమ్స్ లో చికిత్స పొందుతోంది. రెండు చేతులు విరిగిపోగా, లివర్ కు గాయం కావడంతో ఆపరేషన్ చేశారు. మంత్రులు సహచర ఎమ్మెల్యేలతో కలిసి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆమెను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. మణెమ్మ భర్త వెంకటయ్యతో మాట్లాడి ఆర్థిక సహాయం అందించారు. మణెమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంట అంకభూపాలపురం టిడిపి సీనియర్ నాయకులు పెగడ శ్రీనివాసులు, బండారు సోమరాజు తదితరులు ఉన్నారు.

# రాములోరి కల్యాణోత్సవం









(మొదటిపేజీ తరువాయి)

నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరపున స్వామి వారికి సీఎం రేవంత్ రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.



# నూతన వడ్డెర సొసైటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- వడ్డెర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిన మంత్రి లోకేశ్
- వడ్డెర్లను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం : మంత్రి సవిత
- ఎన్నికల హామీ నెరవేర్చినందుకు వడ్డెర్ల ధన్యవాదాలు
- మంత్రి సవితకు సత్కారం
- చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం





**తాడేపల్లి/అమరావతి,కలంకౌంటర్ :** తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం కేటాయించనున్నామని, మినరల్ లీజులో 50 శాతం మినహాయింపు ఇవ్వనున్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెర్లందరికీ ఆర్థికంగా మేలు కలిగేలా నూతన వడ్డెర్ల సొసైటీలు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వడ్డెర కార్పొరేషన్ మల్లె ఈశ్వరరావు ఆధ్వర్యంలో వడ్డెర సామాజిక వర్గీయులు శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. తమకు ఆర్థిక భరోసా కలిగించేలా మైనింగ్ లీజులు కేటాయింపులతో పాటు సినరేజీ మినహాయింపు ఇచ్చినందుకు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన ప్రతి హామీనీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించామన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. మత్స్యకారులకు నష్టం కలిగిస్తున్న వివాదాస్పద 217 జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. చేనేతలకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ అమలు చేయబోతున్నామన్నారు. నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యలో నడిచే సెలూన్లకు ఉచిత విద్యుత్ ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచామన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచామన్నారు. బడ్జెట్ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, రూ.51 వేల కోట్లుకు పైగా వారి అభ్యున్నతికి కేటాయించామన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిధులు గతంలో ఎప్పుడూ కేటాయించలేదని మంత్రి సవిత గుర్తు చేశారు.

**నూతన వడ్డెర సొసైటీల ఏర్పాటుకు ఓకే..** వడ్డెర్లకు ఆర్థిక, సామాజిక గుర్తింపు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో వడ్డెర్ల కష్టాలను మంత్రి నారా లోకేశ్ స్వయంగా చూశారన్నారు. ఆనాడే వారి సంక్షేమానికి, ఆర్థిక ఉన్నతికి పలు హామీలిచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మైనింగ్ లీజుల్లో వడ్డెర సొసైటీలకు 15 శాతం కేటాయింపు, సీనరేజీలో 50 శాతం మినహాయింపు ఇస్తూ మంత్రిమండలి సమావేశంలో తీర్మానం చేశామన్నారు. వడ్డెర స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం శాశ్వత జీవో తీసుకొచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమన్నారు. వడ్డెర్లను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

**చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం..** అంతకుముందు మంత్రి సవితను కలిసి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, డైరెక్టర్లు, ఆ సామాజిక వర్గీయులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఆర్థిక భరోసా కలిగించేలా మైనింగ్ లీజులు కేటాయింపులతో పాటు సినరేజీ మినహాయింపు ఇచ్చినందుకు ఆనందం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మంత్రి సమక్షంలో చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, డైరెక్టర్లు దుర్గారావు, దుర్గా మహాలక్ష్మి, వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన వడ్డెర సామాజిక ప్రతినిధులు కుంచాల సావిత్రి, మణికుమారి, శ్రీరామ్, ఉప్పు శ్రీను, వేముల బాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో లక్ష మందితో రాష్ట్రంలో సూఫీ కాన్ఫరెన్స్

- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం మత గురువుల రాక
- అంతర్జాతీయ స్థాయిలో రాజధాని అమరావతికి గుర్తింపు రావాలని ప్రత్యేక దువా
- ఈద్ మీలాప్ కార్యక్రమంలో సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా





**అమరావతి, కలంకౌంటర్ :** త్వరలో రాష్ట్రంలో అమరావతి కేంద్రంలో లక్ష మందితో సూఫీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు సూఫీ మత గురువులు మరియు రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా. విజయవాడలో రంజాన్ పండుగ తర్వాత జరుపుకునే ఈద్ మిలాప్ ను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షూబ్లీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అల్తాఫ్ బాబా మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత మొట్ట మొదటిసారిగా ఈద్ మిలాప్ నిర్వహించడం శుభపరిణామని అన్నారు. ముస్లింల సంక్షేమ కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి అండగా ఉండేందుకు, రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోరుతూ త్వరలోనే సూఫీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.ఈ కాన్ఫరెన్స్ లో ఇరాక్, ఇరాన్, బాగ్దాద్ లాంటి అనేక ముస్లిం దేశాల నుండి సయ్యద్ హాసిమ్ గీలానీ, ఐతుల్లా అలీ ఖోమినీ లాంటి ప్రపంచ ప్రఖ్యాత ముస్లిం ప్రముఖులు, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ దర్గాల పీఠాధిపతులు తో కలిసి లక్ష మందితో భారీ స్థాయిలో నిర్వహిస్తామని అన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం రాష్ట్ర రాజధాని అమరావతికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలని కోరుతూ ప్రత్యేక దూఆ (ప్రార్థన) నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేశారు అల్తాఫ్ బాబా. ఈద్ మీలాప్ కార్యక్రమంలో మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫారూఖ్, ప్రభుత్వ సలహాదారులు షరీఫ్, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, బోండా ఉమా, యార్లగడ్డ, టిడిపి నాయకులు కొనగళ్ళ నారాయణ, జలీల్ ఖాన్, నాగుల్ మీరా,నెట్టెం రఘురాం,కాల్వ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

# వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు



**అమరావతి,కలంకౌంటర్ :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మల్లాది విష్ణు, జడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, వైసీపీ అధినేత జగన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. “ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యజించి, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని వీడని మహోన్నతుడు శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. ఆ సకల గుణాభిరాముడి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను” అని ఎక్స్ వేదికగా ఆయన శ్రీరామనవమి సందేశాన్ని ఇచ్చారు.

# పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతం చేయాలి

- అంబేడ్కర్ జయంతికి ప్రతీ నియోజకవర్గంలో 2 వేల కనెక్షన్లు
- వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు మంజూరు
- ఇంధన ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో విద్యుత్ శాఖ పరిధిలో అమలు అవుతున్న పనులను వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి డిస్కంల సీఎండీలు, ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్, పీఎం కుసుమ్ పథకాల పురోగతిని సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా అందిస్తున్న పీఎం సూర్యఘర్ సోలార్ కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి, బాబు జగజ్జీవన్ రామ్ జయంతి నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వరకు ప్రతి నియోజకవర్గంలో కనీసం 2 వేల కనెక్షన్లు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులో లక్ష్య సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లన్నింటినీ వచ్చే సీజన్‌కు ముందే మంజూరు చేయాలని సూచించింది. రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రజలపై అదనపు భారం లేకుండా విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం భరిస్తుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి పథకాల అమలులో వేగం పెంచాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# కనుల పండుగగా సీతారాముల కల్యాణం

## -పాల్గొన్న మంత్రి కొండపల్లి,ఎస్పీ దామోదర్





**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లాలోని చారిత్రాత్మక పుణ్యక్షేత్రం రామతీర్థం నీలాచల కొండవద్ద వెలసిన సీతారామచంద్ర స్వామివారి సన్నిధిలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. 'ఉత్తర అయోధ్య'గా పేరుగాంచిన ఈ క్షేత్రంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కుటుంబ సమేతంగా హాజరై, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య, వేద పండితుల మంత్రోచ్చారణలతో అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తులకు కనులపండువగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీరామనవమి పర్వదినం సమాజానికి ధర్మం, న్యాయం, సత్యం వంటి విలువలను గుర్తు చేస్తుందని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం ,కల్యాణ వీక్షణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – శ్రీరామ కల్యాణాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు సులభంగా దర్శనం చేసుకొనే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతోపాటు, జేబు, గొలుసు దొంగతనాలు జరగకుండాను, ట్రాఫిక్ రెగ్యులేట్ చేసే విధంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు డీఎస్పీ, సిఐలను నియమించామన్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగమాధవి దంపతులు, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, పెనుమత్స సూర్యనారాయణ రాజు, సింహాచలం దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకటరావు, ఇతర ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొన్నారు.

# సీతారాముల జీవన విధానం అందరికీ ఎల్లప్పుడూ ఆదర్శప్రాయం - జిల్లా ఎస్పీ




**ఒంగోలు,కలంకౌంటర్ :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు దంపతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య సాంప్రదాయబద్ధంగా మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలను నిర్వహించి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి , ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ,సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ కుమార్ , ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది మరియు ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. సీతారాముల కళ్యాణం కేవలం ఒక వివాహ వేడుక మాత్రమే కాకుండా ధర్మం, న్యాయం, ప్రేమ, కర్తవ్యనిర్వహణ వంటి ఉన్నత విలువలకు ప్రతీకగా నిలుస్తుందని, శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం పరిపూర్ణ మానవ జీవితానికి ఆదర్శప్రాయమని, సీతారాముల జీవిత చరిత్ర ప్రజలందరికీ



మార్గదర్శకమని తెలిపారు. కరుణ, దయ, నీతి, చిత్తశుద్ధి, ప్రేమ, ధర్మం, సత్యం వంటి విలువలను ఆచరిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. శ్రీరామనవమి పండుగను ప్రతి ఇంటా సుఖశాంతులతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు

# 'మే' 1 న "మహా సంకల్ప గర్జన

## -చీర్ల కిరణ్ ఆంధ్రప్రదేశ్ సి పి ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు




**తిరుపతి,కలంకౌంటర్ :** గత 21 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాలుగు లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులు పెన్షన్ లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై గత ప్రభుత్వం హామీ ఇచ్చి నిర్లక్ష్యం వహించిందన్నారు, కనీసం ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం అయినా దృష్టి సారించి ఉద్యోగులకు జీవన్మరణ సమస్య అయిన ఈ సమస్యను పరిష్కరించాలని, లక్షలాది మంది సిపిఎస్ ఉద్యోగుల కళ్ళలో ఆనందం నింపాలని, ప్రభుత్వం పెద్దలు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ సి పి ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కనీసం వృద్ధులకు ఇచ్చే సామాజిక పెన్షన్ల లో సగం కూడా 30 నుండి 40 ఏళ్ల పాటు సర్వీస్ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ ఇవ్వకపోవడం అత్యంత బాధాకరమని, సిపిఎస్ రద్దు చేయాలని ఒక వైపు పోరాటాలు చేస్తుంటే అంతకంటే నష్టం చేకూర్చే విధంగా జిపిఎస్ పేరుతో మరియు యుపిఎస్ పేరుతో మభ్య పెట్టాలని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చూడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాలు సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిందని చీర్ల కిరణ్ తెలిపారు. 57 గవర్నమెంట్ మెమో ప్రకారం 2003లో ఎంపిక అయిన వాళ్లకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం పాత పెన్షన్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి దాదాపు రెండు సంవత్సరములు పూర్తయినప్పటికీ సిపిఎస్ రద్దు పై ఉద్యోగులతో కనీసం చర్చలు జరపడం గాని, స్పష్టమైన హామీ ఇవ్వడం గాని జరగలేదన్నారు. "ఐ.ఆర్, పిఆర్సి, డిఏ," ల ఊసే లేదని పై సమస్యలపై ప్రశ్నిస్తుంటే ఉద్యోగ సంఘాల నాయకులపై సమస్యలు సృష్టించి ఉద్యోగ, ఉపాధ్యాయులను మానసికంగా బాధపెడుతున్నారని చీర్ల కిరణ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతంలో చేసిన పోరాటాల ఫలితంగా 2017 లో ముఖ్యమంత్రి గా ఉన్న ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సిపిఎస్ లో ఉన్న నాలుగు జీవో లలో రెండు జీవో లు అనగా మరణించిన సిపిఎస్ ఉద్యోగి కుటుంబానికి ఫ్యామిలీ పెన్షన్ మరియు డెత్ గ్రాట్యుటీ ని మంజూరు చేస్తూ రెండు జీవో లను రద్దు చేయడం జరిగిందని, తద్వారా కనీసం చనిపోయిన సిపిఎస్ ఉద్యోగులకైనా ఊరట కలిగిందని, అంటే పెన్షన్ కావాలంటే మనిషి చనిపోవాలా అని వాపోయారు. మిలిగి ఉన్న సర్వీస్ పెన్షన్, రిటైర్మెంట్ గ్రాట్యుటీ జీ వో లను మంజూరు చేసి సిపిఎస్ ను పూర్తిగా రద్దు చేయాలని చీర్ల కిరణ్ కోరారు. సిపిఎస్ ఉద్యోగుల పై ఉన్న అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన "ఐ.ఆర్, డి ఏ", బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, పి.ఆర్.సి ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'మే' డే సందర్భంగా 'మే' 1వ తేదిన కడప లో "మహా సంకల్ప గర్జన" కార్యక్రమం చేపడుతున్నట్టు, పెద్ద ఎత్తున నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఉద్యోగులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని చీర్ల కిరణ్ పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో "మహా సంకల్ప గర్జన" పోస్టర్లను ఉద్యోగులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సి పి ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు వంకీపురం పవన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జయచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి మోహన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నక్కు రామచంద్ర, పాషా మొహమ్మద్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం




**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలో ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఉన్న శ్రీ భక్త ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద శ్రీ భక్త ప్రసన్నాంజనేయ కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా సీతారాముల వారి కళ్యాణం నిర్వహించారు. మేకల నర్సింగరావు, గోకరాజు రామకృష్ణ, దొంతి నరేంద్ర, అద్దంకి వెంకటేశ్వర్లు, రాజు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. కళ్యాణం ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. కళ్యాణం అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. అదేవిధంగా నందా వారి వీధి రామాలయంలో ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఎంతో వైభవంగా జరిగింది. పెద్ద బజారు నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో స్వామివారికి చందన అభిషేకం నిర్వహించారు. అశ్వర్థ నారాయణ వృక్షం వద్ద శ్రీరామనవమి పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి నగర్ లో శుక్రవారం రాత్రి వాసవి నగర్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఎంతో వైభవంగా జరిగింది. విచ్చేసిన భక్తులకు పానకం వడపప్పు, అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాల్లో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీ కోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాలు





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పెద్ద బజారు నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో తేదీ 28 శనివారం నుంచి ఏప్రిల్ 4 వరకు నవాహ్నిక బ్రహ్మోత్సవాలు టీటీడీ శ్రీ పాంచరాత్ర ఆగమ పండితులు శ్రీమాన్ గొడవర్తి అనంత వెంకటకృష్ణ దీక్షితులు, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు అనిల్ అనిల్ స్వామి, పవన్ స్వామి పర్యవేక్షణలో జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపారు. శుక్రవారం శ్రీరామనవమి రోజున మహిళా భక్తులు పసుపు దంచి బ్రహ్మోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. 28వ తేదీ గోపూజతో అంకురార్పణ, 29వ తేదీ శేష వాహనం, 30వ తేదీ హంస వాహనం, 31వ తేదీ వ్యాళి వాహనం, ఏప్రిల్ 1హనుమంత వాహనం, 2తేదీ గరుడ వాహనం, 3తేదీ గజవాహనం, 4తేదీ శ్రీ సీతారాముల కళ్యాణం, రథోత్సవం, 5వ తేదీ శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవం, అశ్వ వాహనం, 6తేదీ చక్రతీర్థం, 7తేదీ శ్రీ పుష్ప యాగం, 8వ తేదీ వసంతోత్సవం రాత్రి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియును. ఎనిమిదవ తేదీ మధ్యాహ్నం వైశ్య సమారాధన జరుగునని కావున ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, కోశాధికారి అప్పల మధు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# సీతారాముల కళ్యాణ్ ఉత్సవంలో పసుపులేటి దంపతులు



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ వేడుకలలో గ్రామ ప్రముఖుడు హైదరాబాద్ నివాసి అయిన తరుణ్ ఇంజనీరింగ్ కనస్ట్రక్షన్ కంపెని అదినేత పసుపులేటి లక్ష్మణస్వామి, ప్రమీలారాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం నందు ఆలయకమిటి అధ్వర్యంలో శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవం అంగరంగవైభవంగ జరిగింది . .అనంతరం రెండు వేల మందికి అన్నసమరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమం ఆలయకమిటీ సభ్యులు జొన్నలగడ్డ కొటేశ్వరరావు ,మేకల సుబ్రహ్మణ్యం ,నల్లగంచు వెంకట్రావు గంగుమోలు రమేష్ ,గంగుమోలు ఈశ్వరరావు ,జొన్నలగడ్డ కొండలరావు పర్యవేక్షణలో నిర్వహించారు ...

# వెల్లివిరిసిన మతసామరస్యం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం స్థానిక కోనేరు సెంటర్ వద్ద గల లిమీనార్ మస్జిద్ కమిటీ మరియు జమా అతే ఇస్లామి హింద్ మచిలీపట్నం శాఖ ద్వారా హిందూ సోదరులు నిర్వహించిన శ్రీరామనవమి లిశోభాయాత్ర ను పురస్కరించుకొని నగర పురవీధులలో ఏర్పాటుచేసిన లిశ్రీ రామ శోభ యాత్రలో పాల్గొన్న వారికి లిశీతల పానీయాలు పంపిణీ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారని గడ్డం రాజు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఫెరోజ్, ఉస్మాన్, అన్వార్ హుస్సేన్, నైమతుల్లా, రెహమాన్, షరీఫ్ మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు జోడుగుడుల దేవస్థాన చైర్మన్ శ్రీ దేవనూరు వీరబాబు, దింటకుర్తి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

# ధర్మాన్ని నాలుగు పాదాలు మీద నడిపించిన ధర్మమూర్తి శ్రీరామచంద్ర ప్రభు

## -తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వైవిబి. రాజేంద్రప్రసాద్.




**ఉయ్యూరు ,కలంకౌంటర్ :** శ్రీరామనవమి సందర్భంగా ఉయ్యూరు కాపుల రామాలయం, కాటూరులోని శ్రీరామ మందిరం వద్ద ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమాల్ని ప్రారంభించి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన రాజేంద్రప్రసాద్ . ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి తండ్రి మాట జవదాటని కొడుకుగా, ధర్మాన్ని నాలుగు పాదాలపై నడిపిన ధర్మమూర్తిగా మనందరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని,నేటి సమాజం శ్రీరామచంద్ర మూర్తి చూపిన ధర్మ మార్గంలో నడుస్తూ శ్రీరామ రామ రామేతి బి రమే రామే మనోరమే--సహస్రనామ తత్తుల్యం--రామ నామవరాననే అనే మంత్రంతో, జైశ్రీరామ్ అనే నినాదంతో ముందుకు వెళుతూ, అందరి దేవుళ్ళు చెప్పినట్లుగానే కుల మతాలకు అతీతంగా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉందామని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు రామినేని కుటుంబయ్య గారు, తెదేపా సగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వేమూరి శ్రీనివాస్, మండల తెలుగు యువత అధ్యక్షులు కోడె హరీష్, గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకటనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శరత్, తెదేపా సీనియర్ నాయకులు కొప్పాల అంజిబాబు, ఎలమంచిలి పూర్ణ, ఉయ్యూరు రామాలయ మరియు కళ్యాణమండపం కమిటీ సభ్యులు ,ఉయ్యూరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణ్







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అంగరంగ వైభవంగా శ్రీసీతారాములకల్యాణం 30 మంది పుణ్య దంపతుల చే వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో ఆలయ చైర్మన్ దేసునీరజ బిసుబ్రహ్మణ్యే శ్వరరావు దంపతులు శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. దేసు సుబ్రహ్మణ్యేశ్వ రరావు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజునులి శాలువాతో సత్కరించి జ్ఞాపకను అందజేసి వేద పండితులచే ఆశీర్వచనం గావించారు. ఈ కార్యక్రమంలో ఈవోలి ఆంజనేయులు ట్రస్ట్ సభ్యులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

# రాములోరి కళ్యాణం





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా ఉయ్యురు శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం లో గల పంచ పట్టాబి రామ స్వామి వారికీ కళ్యాణం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని ), విష్ణాలయం చైర్మన్ భాస్కర్ రావు దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు . వెంకటప్రగడ వీరాంజనేయులు దంపతులు పాల్గొన్నారు.



# కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహణ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం రాజారత్నపురం బందరు కోట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి 4వ వార్షిక బ్రహ్మోత్సవాలు, శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు తరలివచ్చి ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొన్నారు.ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర , సతీమణి నీలిమ, తనయుడు పునీత్ చంద్రలతో కలిసి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, మంత్రి కుటుంబ సమేతంగా హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవస్థానం నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఎదుర్కోలు కార్యక్రమం అనేది శ్రీరాముడిని ఆలయానికి ఆహ్వానించే సాంప్రదాయ పద్ధతి. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా తీసుకువచ్చి, భక్తులు మంగళవాయిద్యాలు, హారతులతో స్వాగతం పలుకుతారు. ఈ ఆచారం భక్తులలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడమే కాకుండా, గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది..

# ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ - ఆధ్యాత్మిక విశేష ప్రవచనం ఏర్పాటు.





**విజయవాడ, కలంకౌంటర్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని, శ్రీరామనవమి పర్వదినాన శుక్రవారం సాయంత్రం రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ భాషా ప్రవీణ మరియు సంస్కృత భాషా ప్రచారకులు శ్రీ మైలవరపు లక్ష్మీనరసింహం గారు ఈ ప్రవచనాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు "త్రిశక్తి వైభవం" మరియు "శ్రీరామనవమి విశిష్టత" గురించి భక్తులకు వివరించారు. దుర్గామల్లేశ్వరుల సన్నిధిలో రామకథను వినడం భక్తులకు కనువిందుగా నిలిచింది. అమ్మవారి శక్తికి, రాముని ధర్మానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని వారు తమ ప్రసంగంలో చక్కగా విశ్లేషించారు.కార్యక్రమం అనంతరం ఆలయ చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మరియు ఈవో శ్రీ శీనా నాయక్ గారు ప్రవచనకర్త శ్రీ మైలవరపు లక్ష్మీనరసింహం గారిని శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శ్రీ విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు శ్రీ శంకర శాండిల్య మరియు ఇతర దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం వేళ అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రవచన కార్యక్రమాన్ని వీక్షించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

# సత్య సాయి మందిరంలో సీతా కళ్యాణం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక ఈడేపల్లి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి మందిరము నందు " శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా" నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ పాతూరి జ్ఞానేశ్వరశర్మ, బ్రహ్మశ్రీ పోతుకూచి ఆంజనేయ కుమార్ నేతృత్వంలో కళ్యాణాన్ని అత్యంత రమణీయంగా నిర్వహించేది. మల్లంపల్లి శ్రీనివాసరావు సౌభాగ్య లక్ష్మి, గోకవరపు వీర శంకర మల్లికార్జునరావు నాగలక్ష్మి ప్రశాంతి దంపతులచే, కళ్యాణ మహోత్సవం నిర్వహించరి . ఈ సందర్భంగా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ మాట్లాడుతు, శ్రీరాముడు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, రామరాజ్యం స్థాపించాలి అంటే ప్రతి మానవుడిలోనూ విలువైన సత్య ధర్మశాంతి ప్రేమలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వై సాయిబాబు, గిరీష్ బాబు, ఎంబి రామ్మూర్తి, దారా సూర్య చంద్రరావు తో పాటు ., కాళికాదేవి, కొట్టి నాగమణి, పోతుకూచి నాగమణి, మణిశ్రీ లతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాణిజ్య సిలిండర్లపై కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** వాణిజ్య, పారిశ్రామిక ఎల్పీజీ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఏర్పడిన గ్యాస్ కొరత నేపథ్యంలో కమర్షియల్ సిలిండర్ల కేటాయింపు కోటాను 50 శాతం నుంచి 70 శాతానికి పెంచుతూ శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. దిగుమతులకు అంతరాయం ఏర్పడటంతో పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పెంపులో భాగంగా ఉక్కు, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, రసాయనాలు, ప్లాస్టిక్స్ వంటి కార్మిక ఆధారిత రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇతర పరిశ్రమలకు కూడా ఈ రంగాలు మద్దతుగా నిలుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఉన్న 50 శాతం కేటాయింపులకు అదనంగా మరో 20 శాతం సరఫరా చేయనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అయితే, ఈ అదనపు 20 శాతం కోటా పొందాలంటే వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు తప్పనిసరిగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద నమోదు చేసుకోవడంతో పాటు తమ నగరాల్లోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థల వద్ద పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. ప్రత్యేక ఉష్ణప్రయోజనాల కోసం ఎల్పీజీని వాడే పరిశ్రమలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందని కూడా ఉత్తర్వుల్లో వివరించారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com